సాక్షి
కాకినాడ
శుక్రవారం । 9 । జూన్ । 2023



రూ.1,01,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి గురువారం తెలంగాణకు చెందిన కనుమూరి రఘురామ రాజు రూ.1,01,116 విరాళం అందజేశారు.



విఘ్నేశ్వరునికి రూ.1,11,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అమెరికా వాస్తవ్యులు ప్రభల మాధవీకృష్ణరమేష్ గురువారం రూ.1,11,116 విరాళం ఇచ్చారు.

గరిష్ఠం/కనిష్ఠం
42.5°/28.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.5	31.0
కాకినాడ	40.8	29.8
అమలాపురం	41.0	28.0

న్యూస్‌రీల్

పొల్యూషన్ బోర్డు రీజినల్ ఈఈగా సందీప్‌రెడ్డి



ఈఈగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌రెడ్డి. చిత్రంలో అశోక్‌కుమార్, చలం

కాకినాడ రూరల్: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కాకినాడ రీజినల్ కార్యాలయ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరు(ఈఈ)గా ఎస్.సందీప్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఏపీపీసీబీ హెడ్ ఆఫీసులో పనిచేసిన ఈయన ప్రమోషన్‌పై కాకినాడ రీజినల్ కార్యాలయానికి వచ్చారు. ఇప్పటి వరకు ఈఈగా ఎస్.అశోక్ కుమార్ పనిచేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యావరణ పరిరక్షణ కోసం బాధ్యతయుతంగా పని చేస్తానన్నారు. పరిశ్రమల నుంచి కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సందీప్ రెడ్డికి కార్యాలయ జేఈఓ చలం, సిబ్బంది స్వాగతం పలికారు.

జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిగా జీవీవీవీ ప్రసాదరావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిగా జీవీవీవీ ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె స్వాతి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీకావడంతో ఆమె స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న ప్రసాదరావును నియమించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు విలేకర్లతో మాట్లాడుతూ గతంలో తాను జిల్లాలో పనిచేసినట్లు తెలిపారు. రైతులకు బిందు, తుంపర సేద్యం ద్వారా అధిక ఆదాయం సాధించే విధంగా కృషి చేస్తానని చెప్పారు.

128 గ్రామాల్లో రెండో దశ సర్వే పనులు

కాకినాడ సిటీ: జిల్లాలో 128 గ్రామాల్లో రెండో దశ సర్వే పనులు చేపట్టినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) పూర్తయిన అన్ని గ్రామాల్లో వెంటనే సర్వే పనులు ప్రారంభించాలన్నారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర భూ పరిపాలనశాఖ కమిషనర్ జి సాయిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్ ఇలక్కియ, రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పాల్గొన్న అనంతరం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సమగ్ర భూ సర్వేను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రతీ గ్రామానికి ప్రత్యేక సర్వే అధికారిని నియమించి రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ చెప్పారు. గ్రామాల వారీగా లక్ష్యం నిర్దేశించి సర్వే పనుల్లో పురోగతిని కనబరచాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో సర్వే ఏడీ బి లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోం మంత్రి వనితను కలిసిన స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ



హోంమంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌జేడీ జి.నాగమణి

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనితను గురువారం రాత్రి స్కూలు ఎడ్యుకేషన్ రీజినల్ డైరెక్టర్ జి.నాగమణి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో క్యాంపు కార్యాలయంలో మంత్రికి పుష్పం గుచ్ఛం అందజేశారు. గతంలో ఏనాడూ లేని విధంగా విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఈ సందర్భంగా ఆర్‌జేడీ అన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే రోజునే జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీకి అన్నీ సిద్ధం చేసినట్లు ప్రకటించారు. విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణపై మంత్రితో కాసేపు చర్చించారు.

డెల్టాలకు 6,500 క్యూసెక్కులు

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి కాటన్ బ్యారేజీ నుంచి గురువారం నీటి విడుదలను మరింత పెంచారు. తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

వడదెబ్బకు వ్యక్తి మృతి

కొవ్వూరు: వేములూరులో దొరయ్యచెరువు కాలనీకి చెందిన కొల్లి సత్తిబాబు(45) గురువారం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు మృతుడి కుమారుడు శ్రీనివాస్ తెలిపారు. కూలి పనికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వస్తున్న సమయంలో మార్గమధ్యలో కుప్పకూలి పడిపోయి మృతి చెందినట్లు ఫిర్యాదులో శ్రీనివాస్ పేర్కొన్నాడని పట్టణ ఎస్సై భూషణం తెలిపారు. నందమూరు రోడ్డుమార్జిన్‌లో వేప చెట్టు నీడలో సేదతీరి అక్కడే పడి చనిపోయినట్లు ఎస్సై తెలిపారు.

తుంపర..లాభాల పరంపర

- బిందు, తుంపర పరికరాలతో లాభసాటి వ్యవసాయం
- జిల్లాలో 1300 హెక్టార్లలో సాగు లక్ష్యం
- పరికరాలు అందజేతకు సన్నాహాలు
- ఆర్బీకేల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- చిన్న సన్నకారు, పెద్ద రైతులకు ప్రయోజనం



తుని మండలం తేటగుంటలో బిందు సేద్యం పరికరం పరిశీలన



బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): పంట సాగులో నీటి ఎద్దడిని సూక్ష్మ సేద్యం ద్వారా అరికట్టేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసుకునేలా బిందు, తుంపర సేద్య పరికరాలు (డ్రిప్, స్ప్రింక్లర్) రైతులకు అందజేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. బహిరంగ విపణిలో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయకుండా.. ఆర్బీకేల ద్వారా నామ మాత్రపు రుసుము చెల్లిస్తే చాలు.. సబ్సిడీపై సరఫరా చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆర్బీకేల్లో ప్రారంభమైంది. మైక్రో ఇరిగేషన్ అధికారులు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

2023-24 లక్ష్యాలు ఇలా..

జిల్లాలో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. మెట్ట ప్రాంతంలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిందు, తుంపర సేద్య పరికరాల అవసరం ఉంది. ఈ ఏడాది 1300 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం ప్రోత్సహించాలని మైక్రో ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. మైక్రో ఇరిగేషన్ కంపెనీలు పరికరాలు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, సర్వే, బిందు, తుంపర సేద్య పరికరాల బిగింపు తదితర అంశాలను రైతు భరోసా కేంద్రాల్లోని ఉద్యాన సహాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గత నాలుగేళ్లగా 6352 మంది రైతులకు 7697 హెక్టార్లలో రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందజేశారు. గతేడాది సూక్ష్మ సేద్యం ద్వారా 900 హెక్టార్లు సాగు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. అంతకు మించి 1052 హెక్టార్లు సాగు చేశారు. రూ.5.32 కోట్ల విలువైన పరికరాలను రైతులకు అందజేశారు. ఈ ఏడాది 1300 హెక్టార్లు లక్ష్యంకాగా ఇప్పటికే 1392 మంది 1366 హెక్టార్లలో సాగుకు ముందుకు వచ్చారు.

జిల్లాలో రిజస్ట్రేషన్ (హెక్టార్లలో) ఇలా..

మండలం	రైతులు	విస్తీర్ణం
గండేపల్లి	374	348.1
జగ్గంపేట	198	195.4
రౌతులపూడి	132	155.35
తుని	150	139.77
పెద్దాపురం	109	166.28
ఏలేశ్వరం	99	82.34
ప్రత్తిపాడు	63	69.21
తొండంగి	74	65.25
శంఖవరం	54	54.67
కోటనందూరు	58	52.93
గొల్లప్రోలు	39	43.95
కొత్తపలి	16	19.12
పిఠాపురం	15	12.23
సామర్లకోట	7	6.68
కిర్లంపూడి	3	4.29
తాళ్లరేవు	1	48

ఐదెకరాల్లోపు 90 శాతం రాయితీ

ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఐదెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు గరిష్ఠం 12.50 ఎకరాల వరకు రాయితీ పరికరాలు పొందవచ్చు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 12.50 ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తింప చేస్తారు. తుంపర సేద్యానికి ఎకరం నుంచి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 55 శాతం, 5 ఎకరాలపైన ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తారు. రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. డాక్యుమెంటేషన్ కంపెనీలే చేస్తాయి. రైతు వాటా కింద చెల్లించే నగదు ఫోన్‌పే ద్వారా మైక్రో ఇరిగేషన్ సంస్థకు చెల్లించవచ్చు. బిందు సేద్య పరికాలు ఉద్యాన పంటలకు ఇస్తారు.

అపరాలకు స్ప్రింకర్లు

అపరాలు, గడ్డి పండించేకునే రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్లు ఇస్తారు. 5 ఎకరాల్లోపు 50 శాతం, ఆపై 45 శాతం సబ్సిడీతో అందజేయనున్నారు.

రైతులు ఏం చేయాలంటే..

బిందు, తుంపర సేద్య పరికరాలు పొందాలనుకున్న రైతులు ఆధార్ కార్డు, మీ భూమి వన్‌బీ, బ్యాంకు పాస్ బుక్కు జిరాక్స్ కాపీలు ఆర్‌బీకేల్లో ఇస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. అనంతరం ఫీల్డ్ విజిట్ చేసి అర్హత ఉంటే మంజూరు చేస్తారు. రైతులకు విద్యుత్ సదుపాయం, బోరు తప్పనిసరిగా ఉండాలి.

డ్రిప్ ఉపయోగాలు..

- పంటను బట్టి 30-70 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు.
- పొలంలో ఉన్న మొక్కలన్నింటికీ సమానంగా నీరు అందుతుంది. పెరుగుదలలో వ్యత్యాసాన్ని నివారించే వీలుంటుంది.
- పంట సాగులో వేధించే కలుపు సమస్యను అరికట్టే వెసులుబాటు కలుగుతుంది.
- నీటి ద్వారా ఎరువుల సరఫరా చేస్తుండటంతో పెరుగుదలకు అనుగుణంగా పోషకాలు అందుతాయి.
- ఏకకాలంలో పంట కోతకు వస్తుంది.
- 40 శాతం విద్యుత్ ఖర్చు ఆదా అవుతుంది. కూలీల ఖర్చులు తగ్గుతాయి.
- పంటలకు చీడ పీడలు, పురుగు సమస్య తగ్గుతుంది. ఎత్తుపల్లాలు ఉన్న నేలలో సైతం నీటి సరఫరా సులభతరం అవుతుంది. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరానికి 20నుంచి 30 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో బిందు, తుంపర పరికరాలతో లాభసాటి వ్యవసాయం చేయవచ్చు. చిన్న, సన్నకారుల రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బిందు, తుంపర సేద్యం చేయాలనుకున్న రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో అధికారులు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ పథకానికి గడువు ఏమీ లేదు.

– జీవీవీవీ ప్రసాదరావు, జిల్లా మైక్రోఇరిగేషన్ అధికారి.

స్కూళ్లు తెరిచిన వెంటనే జగనన్న కానుక పంపిణీ



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: పాఠశాలలు తెరిచిన వెంటనే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆమె పాల్గొన్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. వివిధ పథకాల అమలు గురించి ప్రస్తావించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ సక్రమంగా అమలయ్యేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద అవ్వా–తాతలకు కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ ఖాళీలను భర్తీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ ఆధార్ నమోదు చేయాలన్నారు. అంతకు ముందు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ సంబంధించి జగనన్న విద్యాకానుక, మనబడి నాడు–నేడు రెండో దశ పనులు, పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం, జగనన్న చెబుదాం, వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, ఫీవర్ సర్వే, ఎన్సీడీ సర్వే వివరాలు, వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద అవ్వా–తాతలకు చేస్తున్న కంటి శస్త్ర చికిత్సలు తదితర అంశాలపై సమీక్షించారు. డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఎంఅండ్‌హెచ్‌వో ఆర్ రమేష్, డీసీహెచ్‌ఎస్ విష్ణువర్ధిని, ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త పి రాధాకృష్ణ, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, సీపీవో పి త్రినాధ్, డీఈవో కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ, డీఆర్‌డీపీ పీడీ కె శ్రీరమణి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో రౌతులపూడి ఎంఈఓ



లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ రౌతులపూడి ఎంఈఓ వెర్రినాయుడు

రౌతులపూడి: రౌతులపూడి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఎస్ వెర్రి నాయుడు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. రాజమహేంద్రవరం ఏసీబీ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంగారయ్యపేట సమీపంలో స్వర్ణభారతి స్కూల్ రికగ్నేషన్, రెన్యువల్ ఫైల్ ప్రాసెస్ చేసేందుకు ఎంఈఓ ఎస్.వెర్రినాయుడును స్కూలు కరస్పాండెంట్‌ను కలిశారు. ఇందుకు ఆయన లంచం అడిగారు. ఈ విషయాన్ని కరస్పాండెంట్ అవినీతి నిరోధక శాఖ టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేసి చెప్పారు. ముందస్తు వ్యూహంలో భాగంగా ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం స్కూలు కరస్పాండెంట్ గిడజాం వద్ద రూ.7500 లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తర్వాత రౌతులపూడి ఎంఈఓ కార్యాలయంలో విచారించారు. రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ సౌజన్య వెల్లడించారు. పట్టుబడ్డ ఎంఈఓను రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు రాజమహేంద్రవరం గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్, మెడికల్ అండ్ హెల్త్ జూనియర్ అసిస్టెంట్, రాజమహేంద్రవరం జిల్లా వాణిజ్య పన్నులశాఖ (డీసీటీఓ)అధికారి, పిఠాపురం మున్సిపల్ ఏఈ, రౌతులపూడి ఎంఈఓ ఎస్.వెర్రినాయుడులు ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డారన్నారు. తాజా దాడుల్లో ఏసీబీ సీఐలు వి.పుల్లారావు, డి.వాసుకృష్ణ, బి.శ్రీనివాసరావు, వై.సతీష్ ఎస్.ఐ ఎస్.విల్సన్‌బాబు,ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

తాండ్ర, పచ్చళ్ల తయారీతో ఉపాధికి బాట

యూనిట్లను సందర్శించిన ఎమ్మెల్యే కన్నబాబు



సర్పవరం ఆటోనగర్‌లో స్టీమ్‌తో తయారు చేసిన తాండ్రను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: సీజనల్‌గా లభ్యమయ్యే మామిడికాయలు, పండ్లతో పచ్చళ్లు, తాండ్ర తయారీ ద్వారా రైతులు, మహిళలకు ఉపాధి లభిస్తుందని ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సర్పవరం, పండూరు గ్రామాలలో గురువారం ఆయన మామిడితాండ్ర, పచ్చళ్ల తయారీ యూనిట్లను సందర్శించారు. తొలుత సర్పవరంలో తాండ్ర తయారీ తీరును నిశితంగా పరిశీలించారు. అక్కడ నుంచి ఆటోనగర్‌కు చేరుకుని మామిడితాండ్రను స్టీమ్ ద్వారా ఎరువు, ఆకుపచ్చ రంగుల్లో తయారు చేస్తున్న యూనిట్‌ను సందర్శించారు. పండూరులోని మామిడి తాండ్ర, జ్యూస్ తయారీ కేంద్రాలను కూడా పరిశీలించారు. జ్యూస్ నిల్వ సదుపాయంతో పాటు ఏడాది పొడవునా ఏ విధంగా తాండ్ర తయారీ చేస్తారో వలవల వెంకటేశ్వరరావు తదితరులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ మామిడి తాండ్రను ఈ ప్రాంత రైతులు దాదాపు 70, 80 ఏళ్ల క్రితం నుంచి తయారు చేస్తున్నారన్నారు. దీనికి సర్పవరం మూల కేంద్రం లాంటిదన్నారు. ఇక్కడ నుంచి ఇతర గ్రామాలకు విస్తరించిందన్నారు. ఇక్కడి తాండ్ర, పచ్చళ్లను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. వీటి తయారీ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇలాంటి పరిశ్రమలు రావాలనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. తాను ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడి ప్రాంత వ్యాపారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు మైక్రో ఇండస్ట్రీలు ఏర్పాటుకు ప్రోత్సహించామన్నారు. రుణాలు మంజూరు చేయించామన్నారు. గోపుశెట్టి బాబ్జీ, సర్పవరం సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, పండూరు ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివవాసరావు, సొసైటీ అధ్యక్షుడు నందిపాటి సత్తిబాబు, నాయకులు నందిపాటి ధర్మారాజు, ఆదినారాయణ, బావిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీఆర్సీపై హర్షాతిరేకాలు

- 12వ పీఆర్సీ ఏర్పాటుకు సర్కారు నిర్ణయం
- గత ప్రభుత్వాల వైఖరికి భిన్నంగా ముందస్తుగా ప్రకటన
- సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌కు ఆమోదం
- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఎంతో ప్రయోజనం



రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లపై వరాల జల్లు కురిపించింది. ముందస్తుగా 12వ పీఆర్సీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఉద్యోగ, ఉపాధ్యాయ పక్షపాతిగా నిలిచారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దుకు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకుని రావడం కూడా శుభ పరిణామంగా భావిస్తున్నారు. రాష్ట్ర కేబినెట్‌లో బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

కీలక అంశాలపై నిర్ణయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో పాటు పెన్షనర్ల ప్రయోజనానికి పెద్దపీట వేసింది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 11వ పీఆర్సీని గతేడాది జనవరిలో ఆమోదించింది. 11వ పీఆర్సీ ప్రకటించిన తర్వాత 12వ పీఆర్సీకి సమయం ఆసన్నమవడంతో ఇప్పుడు 12వ పీఆర్సీ ఏర్పాటు చారిత్రక నిర్ణయంగా ఆయా వర్గాలు భావిస్తున్నాయి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రిగా జగన్ తనను తాను నిరూపించుకున్నారంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. గత ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను తీసుకుని వచ్చాయి. 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత ఉద్యోగాల్లోకి వచ్చిన వారు సీపీఎస్ వలన తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. సీపీఎస్‌ను రద్దు చేయాలనే నినాదంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనలు చేశాయి. ఎన్నో ఏళ్లుగా ఉన్న డిమాండ్‌ను గమనించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు సీపీఎస్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీ మేరకు సీపీఎస్ స్థానంలో ఏపీ గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) బిల్లు–2023ను కేబినెట్‌లో ఆమోదించారు. ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత 50శాతం పెన్షన్ తగ్గకుండా, డీఏ క్రమంగా పెరిగేలా జీపీఎస్ బిల్లుకు రూపకల్పన చేశారు. జీపీఎస్ బిల్లుపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతానికి భిన్నంగా..

సాధారణంగా పీఆర్సీ కమిషన్ నియమించాలంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేయడం, ఆందోళనలు చేయడం ఆపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పరిపాటి. ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేకుండానే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రిమండలి సకాలంలో 12వ పీఆర్సీని ప్రకటించడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను సంతోషానికి గురి చేసింది. 2023 జూలైలో పీఆర్సీ ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతకంటే ముందుగానే కేబినెట్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. గతానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు స్వాగతిస్తున్నారు. 2022 జనవరి 1 నుంచి ఉద్యోగులందరికీ బకాయిలతో 2.73 శాతం కరువు భత్యం (డీఏ) వర్తింపజేయడం, జిల్లా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు 12 నుంచి 16శాతానికి హెచ్‌ఆర్‌ఏ అమలుకు తీసుకున్న నిర్ణయాలతో మరోమారు ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతిగా నిరూపించుకుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సుమారు 48వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, 40వేల మంది పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో ప్రయోజనం కలగనుంది.

చారిత్రాత్మక నిర్ణయం



రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 12వ పీఆర్సీని అడగకుండానే ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయంగా చెప్పవచ్చు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రభుత్వం సమర్థంగా జీతభత్యాలను చెల్లించింది.

– ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ టీఎఫ్, కాకినాడ

ఈ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి తీసుకుంటున్న నిర్ణయాలు సంతోషాన్ని కలిగిస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి ప్రభుత్వంగా ముద్ర పడింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు రుణపడి ఉంటారు.

– బండి నూకరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, పీఆర్‌టీయూ (ఏపీ102), ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

ఐ బ్యాంకు ఏర్పాటుకు రూ.45 లక్షల విరాళం



సమ్మతి పత్రాలను కలెక్టర్ కృతికా శుక్లాకు అందజేస్తున్న సత్యనారాయణ (అబ్బు), వై డీ రామారావులు

కాకినాడ సిటీ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ ఆధ్వర్యంలో త్వరలో రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు కానున్న 'ఐ బ్యాంక్' కు శ్రీసాయిరామా ఫ్రోజెన్ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్ సత్యనారాయణ (అబ్బు) రూ. 45 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తమ ఏకైక కుమారుడు వీరేన్ మానస్ పేరు మీదుగా ఐ బ్యాంకు ఏర్పాటుకు గురువారం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావుతో కలిసి సమ్మతి పత్రాలను అందజేశారు.

ఐ బ్యాంకు ఏర్పాటుకు భూరి విరాళాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సాంకేతిక సహకారంతో త్వరలోనే ఐ బ్యాంకును ప్రారంభిస్తామని రెడ్‌క్రాస్ చైర్మన్ వై డీ రామారావు తెలిపారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన యువకుడి అరెస్ట్

అంబాజీపేట: వివాహితను పెళ్లి చేసుకోవాలని వెంటపడి వేధిస్తూ ఆమె ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన ఓ యువకుడిని అరెస్ట్ చేసి అమలాపురం కోర్టుకు తరలించినట్లు అంబాజీపేట ఎస్సై ఎ.చైతన్యకుమార్ గురువారం తెలిపారు. గంగలకుర్రు నెల్లివారిపేటకు చెందిన ఓ మహిళకు ఏడేళ్ల క్రితం అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పుట్టింటికి వచ్చిన వివాహితను అదే పేటకు చెందిన నెల్లి అనిల్ తరచూ వెంటపడి పెళ్లి చేసుకోవాలని, లేదంటే కత్తి చూపించి చంపేస్తానని బెదిరించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాడు. దాంతో ఆ వివాహిత మనస్తాపానికి గురై గత నెల 29 రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో బంధువులు, స్థానికులు ఆమెను అమలాపురం ఆస్పత్రికి తరలించారు. వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి అమలాపురం కోర్టుకు తరలించినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

అక్కను హత్యచేసిన తమ్ముడి అరెస్ట్

అంబాజీపేట: ఆస్తి విషయమై కొంత కాలంగా ఘర్షణ పడుతూ అక్కను హత్యచేసిన తమ్ముడిని అరెస్ట్ చేసినట్లు కొత్తపేట డీఎస్పీ కేవీ వెంకట రమణ తెలిపారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. మండలంలోని వాకలగరువుకు చెందిన బొక్కా కృష్ణవేణిని ఆస్తి కోసం ఆమె తమ్ముడు కాండ్రేగుల బాలయోగి ఈ నెల 3వ తేదీన ఆమె తలపై గునపంతో కొట్టాడు. రక్తస్రావంతో ఆమె ఇంటి పై భాగం నుంచి పరుగులు పెడుతూ సమీపంలో ఉన్న కొబ్బరి తోటలో పడి చనిపోయిందన్నారు. నిందితుడు బాలయోగిని వాకలగరువులో అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు.

ఏపీఆర్‌జేసీలోనూ విజయకేతనం

• టాప్ ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు • పదిలోపు ఎక్కువ ఇక్కడే

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు గత నెల 20వ తేదీన నిర్వహించిన పరీక్షా ఫలితాలలో తూర్పుగోదావరి జిల్లా విద్యార్థులు టాప్ లేపారు. ఎంపీసీ విభాగంలో బొమ్మూరుకు చెందిన కళాసాయి సృజన.. బైపీసీ విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన తానింకి సాహితి ప్రథమ ర్యాంకులను సాధించారు. రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన వనపర్తి తేజశ్రీ మూడవ ర్యాంకు(ఎంపీసీ), కాతేరుకు చెందిన దుద్దుపూడి రూపిక నాల్గవ ర్యాంకు(ఎంపీసీ), కోరుకొండ విద్యార్థి కప్పల వెంకట వినీష్ ఐదవ ర్యాంకు (ఎంపీసీ), రాజమహేంద్రవరానికి చెందిన దర్బా కార్తీకరామకిరీటి ఐదవర్యాంకు (బైపీసీ) సాధించారు. దువ్వి ఆశిష్ సాయిశ్రీకర్ ఆరవ ర్యాంకు, ఉర్రింకల జితు కౌముది ఏడవ ర్యాంకు, చవ్వాకుల శ్రీచరణ్ ఎనిమిదవ ర్యాంకు సాధించారు.



విద్యార్థి పేరు : కాలా సాయి సృజన
ఊరు : బొమ్మూరు
ర్యాంకు : ప్రథమ
తల్లిదండ్రులు : కాలా సుబ్బారావు (టీచర్), పద్మజ్యోతి (గృహిణి)
లక్ష్యం : ఐఐటీలో సీటు సాధించడం



విద్యార్థి పేరు : తానింకి సాహితి
ఊరు : రాజమహేంద్రవరం
ర్యాంకు : ప్రథమ
తల్లిదండ్రులు : తానింకి వెంకటరామరాజు (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) నాగమణి (ప్రభుత్వ టీచర్)
లక్ష్యం : నీట్‌లో ర్యాంకు సాధించడం



విద్యార్థి పేరు : వనపర్తి తేజశ్రీ
ఊరు : రాజమహేంద్రవరం
ర్యాంకు : తృతీయ
తండ్రి : మల్లేశ్వరరావు (ప్రైవేట్‌జాబ్)
లక్ష్మీ (గృహిణి)
లక్ష్యం : ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవడం



విద్యార్థి పేరు : దుద్దుపూడి రూపిక
ఊరు : కాతేరు
ర్యాంకు : నాలుగు
తండ్రి : గోవిందు (పేపరుమిల్లు ఉద్యోగి)
పద్మావతి (గృహిణి)
లక్ష్యం : ఐఐటీ కంప్యూటర్ ఇంజినీరింగ్ చదవడం.



విద్యార్థి : కప్పల వెంకట రామవినీష్
ఊరు : కోరుకొండ
ర్యాంకు : ఐదు
తల్లిదండ్రులు : కృష్ణకుమార్, (మీసేవ, జిరాక్స్‌సెంటర్ నిర్వాహకుడు) ప్రవీణలక్ష్మి, (గృహిణి)
లక్ష్యం : ఐఐటీ సీటు సాధించడం.



విద్యార్థి: దర్బా కార్తీక్‌రామ్‌కిరీటి
ఊరు : రాజమహేంద్రవరం
ర్యాంకు : ఐదు
తల్లిదండ్రులు : డా.అరుణ్‌కుమార్ (ఈఎన్‌టీ స్పెషలిస్ట్), శ్రీలత (గృహిణి)
లక్ష్యం : నీట్‌లో ర్యాంకు

ఏసీ నుంచి మంటలు

రూ.3 లక్షల ఆస్తినష్టం



ఇంట్లో కాలిపోయిన మంచం, వస్తువులు

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడిలో ఒక ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని షేక్ అమ్మాజీ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా ఏసీలోంచి పెద్దగా మంటలు వచ్చాయని ఇల్లంతా పొగ కమ్మేసిందని వేడి రావడంతో తాను లేచి చూసే సరికి మంటలు వ్యాపించడంతో తాను బయటకు వచ్చేశానని తెలిపారు. స్థానికులు కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. స్థానికులు గ్యాస్ సిలిండర్లు బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఇనుప బీరువాలో ఉన్న విలువైన పత్రాలు, విలువైన సామాగ్రి, దుస్తులు, నగదు కాలిబూడిద అయ్యాయి. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వచ్చినట్టు తెలిపారు.

భక్తులతో రత్నగిరి కిటకిట

• సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
• మూడు వేల వ్రతాల నిర్వహణ
• ఆదాయం రూ.50 లక్షలు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులు, నవ దంపతులతో రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలి వచ్చారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు భక్తులతో నిండిపోయాయి. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై 40 వివాహాలు జరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో అదే ముహూర్తానికి పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో తమ బంధువులతో కలసి నవ దంపతులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు.

ఐదు వేల మందికి అన్న ప్రసాదం

గురువారం సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు మూడు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

గర్భాలయ ప్రదక్షిణ మార్గంలో ఏసీల ఏర్పాటు

సత్యదేవుని గర్భాలయ ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ ఏసీలు అమర్చారు. దీంతో ప్రదక్షిణ చేసే భక్తులకు ఉపశమనం లభించింది. ఇన్నాళ్లూ భక్తులు ఎక్కువ సేపు క్యూ లో నిలబడడంతో ఆలయంలో ఉక్కపోత భరించలేక ఇబ్బంది పడేవారు. ఏసీలు బిగించడంతో ఎక్కువ సమయం క్యూ లో నిలబడాల్సి వచ్చినా ఇబ్బంది లేకుండా ఉంది.



గురువారం వ్రత మంటపాల వద్ద భక్తుల రద్దీ

ట్రాక్టరును బైకు ఢీకొని ముగ్గురి మృతి

• జి.ముసలయ్యపేట వద్ద ఘటన
• శోక సంద్రంలో శ్రీరాంపురం గ్రామం

తొండంగి: కాకినాడ జిల్లా తొండంగి మండలం జి.ముసలయ్యపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. తొండంగి ఎస్సై రవికుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురానికి చెందిన పోలవరపు కిరణ్(23), పసుపులేటి దుర్గాప్రసాద్(20) కాకర వీరబాబు(21)స్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి బుధవారం రాత్రి బైకుపై స్వగ్రామం నుంచి బీచ్‌రోడ్డు మీదుగా అన్నవరంలో జరిగే స్నేహితుని వివాహానికి బయలుదేరారు. వేమవరం, యర్రయ్యపేట మీదుగా ముగ్గురూ వస్తుండగా జి.ముసలయ్యపేట వద్ద వీరి బైకు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో పోలవరపు కిరణ్, కాకర వీరబాబు సంఘటనా స్థలంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. దుర్గా శివప్రసాద్‌కు తీవ్రగాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికులు తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణ స్నేహాన్ని విడదీయలేకపోయిన మృత్యువు

పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): ముగ్గురు మిత్రుల మరణం పాయకరావుపేట మండలంలోని శ్రీరాంపురం గ్రామాన్ని శోక సంద్రంలో ముంచింది. ఒకరికి తల్లిదండ్రుల్లేరు. మరొకరికి తండ్రి లేడు. ఇంకొకరికి తండ్రి ఉన్నా.. అతని అండ లేదు. కష్ట సుఖాల్లో ఒకరికొకరు తోడై ఉండేవారు. కష్టపడి పనిచేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా ఉన్నారు. వయసులో వారి మధ్య ఏడాది, రెండేళ్ల వ్యత్యాసమే. ఎక్కడికి వెళ్లినా ముగ్గురిదీ ఒకే మాట.. ఒకే వాహనం. అలాంటి మిత్రులను మృత్యువు కూడా ఒకేసారి కాటేసింది. వీరి ముగ్గురూ ఒకే గ్రామానికి చెందిన వారైనా.. కుటుంబ పరిస్థితి మాత్రం ఒక్కొక్కరిది ఒక్కోలా ఉంది.

• దుర్గాశివప్రసాద్‌కు తల్లిదండ్రుల్లేరు. చిన్నప్పటి నుంచి మేనత్త రమణమ్మ వద్దే ఉంటున్నాడు. రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే మిల్లర్ పని చేస్తూ, ఆమెకు భరోసాగా ఉన్నాడు. ఇతని మరణంతో మేనత్త రమణమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

• కిరణ్‌కుమార్‌కు తల్లి లక్ష్మి, సోదరి హరిణి ఉన్నారు. తండ్రి బతికే ఉన్నా.. ఆ కుటుంబానికి దూరంగా ఉంటున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. తల్లి స్థానికంగా ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీలో కూలిపని చేస్తోంది. సోదరి దివ్యాంగురాలు కావడంతో ఆశలన్నీ కిరణ్ మీదే పెట్టుకున్నారు. కిరణ్ గ్రామంలో కూలి పనులతోపాటు, పెయింటింగ్ పనులకు వెళ్తుంటాడు. త్వరలోనే పెళ్లి చేసేందుకు సంబంధాలు కూడా చూస్తున్నారు. అలాంటి సమయంలోనే తమకు అందరాని దూరాలకు పోయిన కిరణ్‌ను తలచుకుంటూ ఆ తల్లి, కూతుళ్ల శోకం ఊరంతటినీ పట్టి కుదిపేస్తోంది.

• కాకర వీరబాబు మిల్లర్ పనితోపాటు, వ్యాన్ డ్రైవింగ్ చేస్తుంటాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. తండ్రి దారబాబు ఇంటి వద్దనే ఉంటాడు. తల్లి మేరీ గల్ఫ్‌లో ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. కొడుకు మరణవార్త తెలుసుకుని ఆ తల్లి అక్కడి నుంచి బయలుదేరినట్టు తెలిసింది.



కిరణ్‌కుమార్ మృతి చెందడంతో భోరున విలపిస్తున్న తల్లి లక్ష్మి



జి.ముసలయ్యపేట వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైకు



మృతులు కిరణ్, శివ, వీరబాబు (ఫైల్)

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

రూ.11 లక్షల విలువైన 27 వాహనాలు స్వాధీనం

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు పశ్చిమగోదావరి జిల్లాలో 27 మోటారు వాహనాలను దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి అమలాపురం కోర్టులో హాజరు పరచినట్లు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మోటారు సైకిల్ దొంగ కేశవరపు సుబ్రహ్మణ్యం (సుబ్బు)ను నేరాలను వెల్లడించారు. పి.గన్నవరం మండలం వై.కొత్తపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం కాఫీ హోటల్‌లో పనిచేస్తుంటాడని, ప్రవృత్తిగా మోటారు సైకిళ్లను దొంగతనం చేస్తూ ఉంటాడన్నారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 4, పి.గన్నవరం 4, నగరం 1, రాజోలు 4, పాలకొల్లులో 1 మొత్తం 14 మోటారు సైకిళ్ల దొంగతనం చేసినట్టు గుర్తించామన్నారు. మరో 13 మోటారు సైకిళ్లను గుర్తించవలసి ఉందన్నారు. వీటి విలువ రూ.11 లక్షల వరకు ఉంటుందన్నారు. మాచవరం గ్యాస్ గోడౌన్ వద్ద అరెస్ట్ చేసి, అతను ఉంచిన మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్, స్థానిక ఎస్సై ఎ.చైతన్య కుమార్, సిబ్బంది హెచ్‌సీ బి.శ్రీనివాస్, కానిస్టేబుల్ డి.చిరంజీవికృష్ణ, కె.ఉమామహేశ్వరరావు, సీహెచ్ జగదీష్‌లను డీఎస్పీ అభినందించి, రివార్డుకు సిఫారసు చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రమణ

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

అంబాజీపేట: నాలుగేళ్లుగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆపై మోసం చేసిన ఓ యువకుడిని పోక్సో కేసులో అరెస్ట్ చేసినట్లు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ చెప్పారు. ఇందుకు సంబంధించి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పి.గన్నవరం మండలం ముంగండ పాలెంకు చెందిన ఒక బాలికను రాజోలు మండలం ములికిపల్లికి చెందిన ముసునూరి వరప్రసాద్ ప్రేమ పేరుతో వంచించి, ఆమె పై పలుసార్లు అత్యాచారం చేశాడన్నారు. ప్రసాద్ పి.గన్నవరంలోని తన బంధువుల ఇంటికి వచ్చినప్పుడు ఆ బాలికతో నాలుగేళ్ల క్రితం పరిచయం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ బాలికకు మాయ మాటలు చెబుతూ.. పెళ్లి మాట ఎత్తే సరికి మోహం చాటేశాడన్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో, అత్యాచారాల చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు డీఎస్పీ రమణ తెలిపారు. నిందితుడిని రాజోలు మండలం ములికిపల్లిలో అరెస్ట్ చేసి అమలాపురం కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

26 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి

ఉత్తర్వులు అందజేసిన జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు




పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, చిత్రంలో జెడ్పీ సీఈవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పరిపాలనాధికారులు, విస్తరణాధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆయా ఉద్యోగులకు ఎంపీడీవోలుగా ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాకు మొత్తం 26 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో 12 మంది పరిపాలనాధికారులు, 14 మంది విస్తరణాధికారులు ఉన్నట్లు జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు వివరించారు. పని తీరు ఆధారంగాను, ప్రస్తుత మండలాలల్లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసేందుకు అనుభవం దృష్ట్యా మండల పరిషత్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నియామకాలు ఇలా..

ఐ.రత్నరాజు (కాజులూరు), ఎంవీఆర్ కుమార్ బాబు (ప్రత్తిపాడు), బి.చిన్నారావు (పిఠాపురం), పి.రవికుమార్ (తుని), బత్తిన అశోక్‌కుమార్ (పెద్దాపురం) జి. శివరామకృష్ణ (శంఖవరం), కె.నరేంద్రరెడ్డి (రాయవరం), ఎస్‌వీ చలం (కాట్రేనికోన), ఎంవీఎస్ నాయుడు (మలికిపురం), జగారావు రాంబాబు (ముమ్మిడివరం), ఎం.భారతి (పి.గన్నవరం), బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ (అల్లవరం), జి.నాగరాజకుమారి (ఉప్పలగుప్తం), జె.వెంకటేశ్వరరావు (అమలాపురం), కె.పద్మజ్యోతి (గోకవరం), కె.హిమ మహేశ్వరి (అనపర్తి), యు.కుమార్‌పట్నాయక్ (ఎటపాక), ఎల్. యాదగిరిశ్వరరావు (రాజవొమ్మంగి), డీఎస్ రత్నకుమారి (దేవీపట్నం), బి.హరికృష్ణ (రంపచోడవరం)

వినియోగదారులకు నిరంతర విద్యుత్



రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రోజుకు తలసరి 21 మిలియన్ యూనిట్ల అత్యధిక వినియోగం ఉన్నప్పటికీ వినియోగదారులకు ఏవిధమైన ఇబ్బందీ లేకుండా నిరంతరం విద్యుత్ పంపిణీ చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ టీవీఎస్ఎన్ మూర్తి గురువారం ప్రకటించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించని ఇబ్బందికర పరిస్థితులలో సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. కాకినాడ 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రధానంగా రెండు 220 కేవీ సర్క్యూట్‌ల ద్వారా పరవాడ నుంచి సరఫరా అవుతుందన్నారు. 7వ తేదీ బుధవారం సాయంత్రం 6:50 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పరవాడ నుంచి కాకినాడ వచ్చే 220 కేవీ రెండవ సర్క్యూట్ బ్రేక్‌డౌన్ కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ కారణంగా గ్రిడ్‌లో విద్యుత్ సరఫరా స్థిరీకరించేందుకు, 220 కేవీ పరవాడ కాకినాడ 1వ సర్క్యూట్‌పై ఓవర్ లోడ్ పడకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరా నియంత్రించే కార్యక్రమం చేపట్టామన్నారు. దీనివల్ల కాకినాడ రెవెన్యూ డివిజన్‌లో కొన్ని ప్రాంతాలలో, అమలాపురం రెవిన్యూ డివిజన్‌లో కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు రొటేషన్ పద్ధతిలో లోడ్ రిలీఫ్ ఇచ్చామన్నారు.

నేడు నన్నయలో మెగా జాబ్‌మేళా

రాజానగరం: ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా అధికారి ఎం.కొండలరావు తెలిపారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, టీసీఎల్, ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చర్స్, కాలిబ్ హెచ్‌ఆర్, పేటీఎం, వరుణ్ మోటార్స్, ఇండియన్ డెయిరీ ఎక్విప్మెంట్ అండ్ ఫ్యాబ్రికేటర్స్, ముత్తూట్ ఫైనాన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మసీ, బీఎస్‌టీ టెక్నాలజీస్, నైపుణ్య భారత్ ఇన్నోవేషన్స్, మెడ్ ప్లస్ తదితర 15 కంపెనీలు ఈ మేళాకు హాజరై సుమారు 700 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయన్నారు. బీటెక్/ఎంటెక్, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీకామ్/ఎంకామ్, ఎంబీఏ, ఎం.ఫార్మసీ/బి.ఫార్మసీ/డి.ఫార్మసీ, 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసి 19 నుంచి 30 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 79896 56834, 95818 10049 నంబర్లలో సంప్రదించవచ్చు.